# రెటమతం పెళ్లికొడుకు

కథ

వాణిశ్రీ

మహేష్ పెళ్లి ఉదయం పదకొండు గంటలకు డోగి పర్తి సుబ్బారావు కళ్యాణ మండపంలో. హైదరాబాద్‌లో రాత్రి పదింటికి బయల్దేరి తెల్లవారుతూనే గుంటూరు చేరుకున్నారు. మగ పెళ్లివారికి నాజ్ సెంటర్లో హోటల్ రూములు విడిదిగా ఏర్పాటు చేశారు ఆడ పెళ్లివారు.

ఇద్దరు టీనేజ్ కుర్రాళ్లు పెళ్లివారి అవసరాలు చూస్తున్నారు. పెళ్లికొడుకు మహేష్ స్నానం చేసి రెడీ అయిపోయాడు.

"నీ పేరేమిటోయ్?" ఇద్దర్లో పెద్దవాడిని అడిగాడు మహేష్.

"కళ్యాణ్ అండీ!" అన్నాడు సిగ్గుపడుతూ ఆ నూనూగు మీసాల కళ్యాణ్.

"నువ్వు నాకేమవుతావు?"

కళ్యాణ్ తెల్లబోయాడు. మహేష్ అడిగిన ప్రశ్న తికమకగా ఉంది.

"అదేనోయ్? పెళ్లికూతురికి ఏమవుతావ్?"

"అంజలి మా పెద్దమ్మకూతురండీ!" చెప్పాడు కళ్యాణ్.

"ఐతే! నువ్వు నాకు బామ్మర్దివి. ఔనా?"

కళ్యాణ్ తల ఊపాడు.

"చూడు బామ్మర్దీ! ఇంటికెళ్లి మీ పెదనాన్నతో చెప్పు. పెళ్లి చేసే పంతుల్ని నా దగ్గరకు పంపమను. అర్జెంట్. ఏం?"

కళ్యాణ్ మహేష్ డిమాండ్ వింటూనే స్కూటర్ మీద కొత్తపేటలో ఉన్న పెద్దమ్మగారింటికి వెళ్లి చెప్పాడు. కృష్ణమూర్తికి అల్లుడి డిమాండ్‌లో మతలబు ఏమిటో అర్థం కాలేదు. విడిదింట్లో దిగిన వియ్యాలవారు తమకు 'అది కావాలి' 'ఇది కావాలి' అని డిమాండ్ చేస్తారు. టిఫిన్ బాగోలేదనో, కాఫీ చిక్కగా లేదనో, స్నానానికి వేడినీళ్లు అందలేదనీ ప్రతి దానికీ వంకలు పెట్టి చిర్రుబుర్రులాడడం సహజం. ఇతగాడేమిటి? పంతుల్ని పంపమంటాడు? అని బుర్ర గోక్కున్నాడు.

"అన్నాయ్! అల్లుడిదంతా రెటమతం లాగుంది. ఎంగేజ్‌మెంట్ అప్పుడే అర్థమైంది నాకు. "అర్ధరాత్రి అంకమ్మ శివాలని, తెల్లవారుజామున పెళ్లేంటి? నాన్సెన్స్! ఇంకేం ముహూర్తాలు దొరకలేదా పంతులుగారూ!" అని చిందులు తొక్కాడు. "ఇతర మతాల వాళ్లు చక్కగా ఉదయం పదింటికి పెళ్లిళ్లు చేసుకుంటారు. వచ్చిన వాళ్లకి సౌకర్యంగా ఉంటుంది. అటువంటి ముహూర్తం పెట్టండి" అని గొడవ చేశాడు. "ఇప్పుడు అల్లుడికి ఇంకేం ఐడియా వచ్చిందో?" అన్నాడు కృష్ణమూర్తి తమ్ముడు శేషగిరి.

"సర్లేరా! ఇప్పుడిక చేసేదేవుంది? పంతులు కళ్యాణమండపం దగ్గరికి వస్తానన్నాడు. నువ్వు కారేసుకెళ్లి పంతుల్ని ఎక్కించుకుని అల్లుడి దగ్గరికి తీసుకెళ్లు" అన్నాడు కృష్ణమూర్తి.

శేషగిరి కళ్యాణమండపానికి వెళ్లి "పంతులుగారూ! అల్లుడు మీతో ఏదో మాట్లాడతాడంట పదండి. కారెక్కండి" అన్నాడు.

"అల్లుడుగారు నాతో మాట్లాడాలా? ఏందండి బాబూ?" అని కంగారుపడ్డాడు నందం రామశాస్త్రి.

"ఏమో? నాకేం తెలుసు? అల్లుడు హోటల్లో ఉన్నాడు. మిమ్మల్ని అర్జెంటుగా పంపమన్నాడు" అని వెర్రి నవ్వు నవ్వాడు శేషగిరి.

"పెళ్లెట్లా చేయించాలో నాకు క్లాసు పీకుతాడేమో మీ అల్లుడు" అని గొణిగాడు రామశాస్త్రి.

ఇద్దరూ కారెక్కి హోటలకెళ్లారు.

"ఏం లేదు పంతులుగారూ! పెళ్లితంతులో కొన్ని ఐటెమ్స్ నాకు నచ్చలేదు. అవి తీసేయాలి" అన్నాడు మహేష్ వీళ్లని చూడగానే.

"తమ ఇష్టం. పెంచమంటే కష్టం గానీ, తగ్గించమంటే కష్టమేముంది? నాకూ సుఖమే. సెలవియ్యండి" అన్నాడు రామశాస్త్రి.

"కన్యాదానం అని ఒక ఐటెమ్ ఉంది చూడండి అది తీసెయ్యండి. దానం ఏమిటండీ దానం? మనిషిని దానం చెయ్యడం ఏమిటి? పెద్దవాడు మామగారు అల్లుడి కాళ్లు కడగడమేమిటి? నాన్సెన్స్ కాకపోతే"

"సరేనండి. మీకు ఇష్టం లేకపోతే తీసేద్దాం"

"ఇంకొకటి. అప్పగింతలంటూ ఒకటుంది. శుభమా అని పెళ్లిలో అంతా సంతోషంగా ఉంటే, అప్పగింతలంటూ పెళ్లికూతురి తల్లిదండ్రుల్ని, బంధువుల్ని ఏడిపించడం ఎందుకండీ? అమ్మాయి ఏమైనా శాశ్వతంగా దూరమైపోతున్నదా? ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు పుట్టింటికొస్తుంది. బస్సులు, రైళ్లున్నాయి. ఇతర దేశాలకెళ్లినా విమానాలున్నాయి. ఇబ్బంది ఏవుంది? రోజూ సెల్‌ఫోన్లో మాట్లాడుకోవచ్చు. అప్పగింతలని సన్నాయి, క్లారినెట్ వాళ్లు ఏడుపుగొట్టు ట్యూనొకటి వాయించి అందర్నీ ఏడిపిస్తారు"

"సరేనండి. అప్పగింతలు గూడా కేన్సిల్. ఇంకేం సెలవిస్తారు?" వినయంగా అడిగాడు రామశాస్త్రి.

"ప్రస్తుతానికి ఇవే. ఇంకేదైనా జ్ఞాపకం వస్తే అప్పుడు చెప్తాను" అన్నాడు మహేష్.

రామశాస్త్రి తల ఊపి, శేషగిరివైపు చూసి వెర్రి నవ్వొకటి నవ్వాడు.

* * *

పదకొండు గంటలకు పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోవడంతో అంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. పెళ్లికొడుకు పెళ్లి తంతు జరిగేటప్పుడు ఏం పేచీ పెడ

తాడోనని హడలిపోయిన రామశాస్త్రి అతగాడేం జోక్యం చేసుకోనందుకు ఆనందించాడు.

"నాన్నా! మహేష్! మేమంతా భోజనాలైన తర్వాత బయల్దేరతాం. నువ్వు ఇక్కడే ఉండాలి" అన్నాడు మహేష్ తండ్రి సుబ్బారావు.

"మీరంతా వెళ్లిపోతుంటే నేనొక్కడ్నే ఇక్కడెందుకు?" సీరియస్‌గా అన్నాడు మహేష్.

"మరీ ఒక్కడివి కాదులే. అక్కా, బావ ఉంటారు. కావాలంటే నీ ఫ్రెండ్స్ ఇద్దరు, ముగ్గుర్ని తోడుగా ఉంచుకో!"

"అదే! ఎందుకని?"

సుబ్బారావు ముసిముసి నవ్వులు నవ్వాడు.

"అత్తగారింట్లో ఈ రాత్రికి శోభనం. మూడు నిద్రలయ్యే వరకు ఇక్కడే ఉంటావు. తర్వాత అమ్మాయిని తీసుకుని మనింటికి వస్తావు" అన్నాడు.

"శోభనం లేదు. ఏం లేదు. కేన్సిల్ నాన్నా!"


కొడుకు మాటలు విని అదిరిపడ్డాడు సుబ్బారావు. అతని ధోరణి ఏమిటో అంతుపట్టలేదు. పెళ్లి కుదిరిన దగ్గర్నుంచి అడుగడుగునా అడ్డు పడుతున్నాడు. ప్రతి దానికీ వంకలు పెట్టడమే. రెట మతంలే అని అంతా సర్దుకు పోతున్నారు. ఏకంగా ఇప్పుడు 'శోభనం వద్దంటాడేమిటి? తిక్క వెధవ!' అనుకున్నాడు సుబ్బారావు.

"ఏరా! నీకీ పెళ్లి ఇష్టం లేదా?" కోపంగా అడిగాడు సుబ్బారావు.

"ఇష్టం లేకపోతే ఎందుకు చేసుకుంటాను?"

"మరి ఇంకేంటి? కట్నం వద్దన్నావు. పెళ్లనేది ఆడపిల్లకే అవసరమా? మగవాడికి కాదా? ఇద్దరికీ అవసరమే కదా? అటువంటప్పుడు ఆడపిల్ల కట్నం ఇచ్చి ఎందుకు పెళ్లి చేసుకోవాలి? దురాచారం అని ఉపన్యాసం దంచావు. పగలు పెళ్లి చెయ్యాలన్నావు. కన్యాదానం నాన్సెన్స్ అన్నావు. అప్పగింతలు అసలే వద్దన్నావు. బాగానే ఉంది. శోభనం వద్దంటావేమిటి? అవ్వ. అంతా ఏమనుకుంటారు? నీకు గానీ మతిగానీ పోయిందేంట్రా?" అని కొడుకు మీద మండిపడ్డాడు సుబ్బారావు.

"ఎవరేమనుకున్నా ఐ డోంట్ కేర్. నాకు ఇష్టం లేదు. రెండో మాట లేదు. నేనూ అందరితోపాటు హైదరాబాద్ వస్తున్నాను" సీరియస్‌గా అని వెళ్లిపోయాడు మహేష్.



"ఏమేవ్! చూశావా? వీడి యవ్వారం? శోభనం వద్దంట" అని కేకలేసుకుంటూ భార్య దగ్గరికి వెళ్లాడు సుబ్బారావు.

పార్వతి తెల్లమొఖం పెట్టింది. ఆమె నోట మాటలు రాలేదు. క్షణాలలో ఈ సంగతి తాటాకుమంటలా అంటుకుంది.

"పెళ్లి కొడుకు శోభనం వద్దన్నాడంట" అని అటు ఆడ పెళ్లి వారు, ఇటు మగపెళ్లివారు గూడా గుసగుసలాడుకున్నారు.

"ఏదైనా తేడా ఉందా?" అని కొందరు అనుమానం వ్యక్తం చేశారు.

"ఏమండీ బావగారూ! అబ్బాయి మీతోపాటు ప్రయాణమవుతున్నాడంట? ఇక్కడ మూడు నిద్రలు చేయడా?" లౌక్యంగా అడిగాడు కృష్ణమూర్తి.

"మీరేం అనుకోకండి. మా వాడికి ఆర్భాటాలు పనికిరావు. సింపుల్‌గా ఉండడం ఇష్టం. అదెందుకు? ఇదెందుకు? అని వాదిస్తుంటాడు" సర్ది చెప్పాడు సుబ్బారావు.

"పాతబడిన ఆచారాలు మానుకోవడం బాగానే ఉంది కానీ.. శోభనం వద్దనడం...!" అని నీళ్లు నమిలాడు కృష్ణమూర్తి.

"ఆ తంతు వద్దన్నాడు గానీ కాపురం చెయ్యననడం లేదుగా! వాడిదంతా రెటమతం. మీరేమీ అనుమానాలు పెట్టుకోకుండా మంచిరోజు చూసి అమ్మాయిని తీసుకొచ్చి మా ఇంట్లో వదిలిపెట్టండి. అన్నీ సర్దుకుంటాయి" అని వియ్యంకుడికి సర్దిచెప్పాడు సుబ్బారావు.

కృష్ణమూర్తి అయోమయంగా తల ఊపాడు. తర్వాత మహేష్ అందరితో పాటు హైదరాబాద్ వచ్చేశాడు.

* * *

నాలుగు రోజుల తర్వాత కృష్ణమూర్తి దంపతులు కళ్యాణిని హైదరాబాద్ తీసుకొచ్చి అత్తవారింట్లో వదిలిపెట్టారు. సారెలు, చీరలు అవి సామాన్లు తీసుకురావొద్దని ముందుగానే వార్నింగ్ ఇవ్వడంతో బీరువాలు, ఫ్రిజ్‌లు

వంటివి తేలేదు. సింపుల్‌గా కళ్యాణి నగలు, చీరలు తెచ్చారు.

కళ్యాణికి చాలా అసంతృప్తిగా ఉంది. శోభనం వద్దని అందరితోపాటు చెక్కేసిన మహేష్ మీద కోపంగా గూడా ఉంది. తమ ఇంట్లో మూడు రోజులు ఉంటాడని, సినిమాలకు, షికార్లకు తీసుకెళ్తాడని కన్న రొమాంటిక్ కలలు కల్లలయ్యాయి.

"మీ ఆయన రెటమతం పెళ్లికొడుకటగా? శోభనం వద్దని భీష్మించుకున్న పెళ్లికొడుకుని ఇప్పుడే చూస్తున్నాం" అని అంతా కళ్యాణిని ఆట పట్టించారు.

"మీ ఆయనకి పొదుపు ఎక్కువంటగా? కట్నం, కానుకలు వద్దన్నాడు, ఆఖరికి శోభనం కూడా వద్దని మీ వాళ్లకి స్వీట్స్, మల్లెపూలు పొదుపు చేశాడు" అని మరికొందరు ఎగతాళి చేశారు.

జరిగిన దానికి అతని మీద మండుకొచ్చింది కళ్యాణికి. కానీ అత్తగారింట్లో శోభనం ఏర్పాట్లు ఉంటాయేమోననే ఆశ మినుకుమినుకుమంటోంది. ఇక్కడ గూడా ఆ రాత్రి ఏర్పాట్లు లేకపోవడంతో ఆశ్చర్యం కలిగింది.

మర్నాడు ఉదయం "కళ్యాణీ! మీ ఆయనకి కాఫీ ఇవ్వు. బెడ్‌కాఫీ తాగడం వాడికి అలవాటు" అన్నది అత్తగారు పార్వతి.

ఆమె కాఫీ కప్పు తీసుకుని అతని బెడ్‌రూమ్‌లోకి వెళ్లింది. ఆమెను చూడ్డంతోనే మహేష్ నవ్వు ముఖం పెట్టి, చదువుతున్న పేపరు పక్కన పెట్టి కాఫీకప్పు అందుకున్నాడు.

"కళ్యాణీ! రాత్రి బాగా నిద్ర పట్టిందా?" కాఫీ సిప్ చేస్తూ అడిగాడు మహేష్.

"ఎందుకు పట్టదూ?" సీరియస్‌గా ఎదురు ప్రశ్నించింది.

"ఆహా.. అది కాదు. కొత్త చోటు గదా అని" ఆమె కోపం గమనించి అన్నాడు నెమ్మదిగా.

"నాకెక్కడైనా నిద్రపడుతుంది" అన్నది.

"ఓకే! కళ్యాణీ! నువ్వు పదింటికంతా రెడీ అయిపోవాలి. నీకు మా సిటీ అంతా చూపిస్తాను" అన్నాడు.

కళ్యాణి తల ఊపి ఖాళీ కప్పు తీసుకుని వెళ్లిపోయింది. పదింటికి ఇద్దరూ కారులో బయల్దేరారు. ముందుగా చార్మినార్ దగ్గరికి తీసుకెళ్లాడు. చుడీ బజార్‌లో ఆమెకు నచ్చిన రాళ్లగాజులు వగైరా కొని పెట్టాడు. మక్కామసీదులోకి తీసుకెళ్లాడు. జొన్నలు కొని పావురాలకు మేత వేశారు. అవి భయం లేకుండా దగ్గరకొచ్చి తింటుంటే ఆనందించారు.

"ఇక్కడ ముత్యాలు చాలా బాగుంటాయి కళ్యాణి. చౌక గూడా. ఎన్నో వందల ఏళ్లుగా ప్రసిద్ధి చెందాయి" అని ఒక షాపులోకి తీసుకెళ్లాడు.

"ఇప్పుడెందుకండీ! ఇప్పటికే చాలా నగలున్నాయి" అన్నది కళ్యాణి.

"భలే దానివే! దేని అందం దానిదే!" అన్నాడు ఆమె అరచేతిని సున్నితంగా పట్టుకుని తీసుకెళ్లాడు.

కళ్యాణికి ఆ అనుభవం ఎంతో హాయిగా ఉంది. అసలు శోభనం వద్దన్నవాడు, తను అత్తగారింటికి వెళ్లినా అంటీముట్టకుండా సీరియస్‌గా, ధుమధుమలాడుతూ ఉంటాడేమో అని భయపడింది. అలా కాకుండా చనువుగా, ప్రేమగా ఆప్యాయత చూపిస్తున్నాడని తృప్తి పడింది. షోరూమ్‌లో సన్నటి ముత్యాలు మూడు పేటలుగా అల్లిన హారం తీసుకుంది. ఆ డిజైన్ ఆమెకు ఎంతో నచ్చింది.

తర్వాత ఫలక్‌నామా ప్యాలెస్ చూపించాడు. అందులో నవాబు వైభవం చూసి ఆశ్చర్యపోయింది. సాలార్జంగ్ మ్యూజియం చూసి, ఉస్మానియా హాస్పిటల్ మీదుగా అసెంబ్లీ బిల్డింగ్ వగైరా చూపించి ద్వారకా హోటల్లో భోజనం తర్వాత ప్రసాద్ ఐమాక్స్‌లో సినిమాకి తీసుకెళ్లాడు. సాయంకాలం ట్యాంక్ బండ్ మీద తెలుగు వెలుగు విగ్రహాలు, యన్టీఆర్ ఘాట్, బిర్లా మందిరం చూశారు.

ఆ రోజంతా సిటీలో తిరిగినా కళ్యాణికి అలసట అనిపించలేదు. ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. మహేష్ ఫ్రెండ్లీగా, ఎంతో కాలం నుంచి తెలిసిన వాడిలా కలిసిపోయాడు. అతను చొరవ తీసుకుని ఆమె చేతిలో చెయ్యి వేసి నడిపిస్తుంటే ఆ అనుభవం అద్భుతంగా ఉంది. 'ఎన్నో జన్మల బంధం నీది నాది' అనిపించింది.

ఆ రాత్రి పాలగ్లాసు చేతికిచ్చి బెడ్‌రూమ్‌లోకి పంపించింది అత్తగారు.

అతను పాలగ్లాసు అందుకుని "బాగా అలసిపోయావా?" అని అడిగాడు తన పక్కనే కూర్చోబెట్టుకుని.

"ఉహూ.." అన్నది కళ్యాణి సిగ్గుపడుతూ.

ఆమెను కౌగిలిలోకి తీసుకుని "నా మీద కోపం పోయిందా?" గుసగుసలాడుతున్నట్లు చెవిలో అన్నాడు.

"నాకేం కోపం లేదు" అన్నది.

"అబద్ధం చెప్తున్నావు. నేను మీ ఇంట్లో శోభనం వద్దన్నందుకు నీకు కోపం వచ్చే ఉంటుంది" అన్నాడు.

కళ్యాణి నవ్వి ఊరుకుంది.

"ఆ శోభనం తతంగం నాకు ఎబ్బెట్టుగా అనిపిస్తుంది కళ్యాణీ! ఇంటినిండా జనం. గదిలోకి మనల్ని నెట్టడం. లోపల పూలదుకాణం, స్వీట్‌షాపు డెకరేషన్. పెద్దవాళ్లకు అంతా తెలుసు. కానీ పెళ్లి కాని వయసులో ఉన్న పిల్లలు మన చేష్టలు ఎలా ఊహించుకుంటారు? చిన్నపిల్లలు మనల్ని లోపలకు నెట్టి గడి వేయడం ఎందుకు? అని అడిగితే ఏం చెప్తారు? స్త్రీ, పురుషులు కలిసినప్పుడు తనువులు కలుస్తాయి. అదేదో పరీక్ష మాదిరి జరగడం ఏమిటి? తెల్లారి నిన్ను మీ ఆయన ఏం చేశాడని ప్రశ్నిస్తూ ఆట పట్టించడం ఏం బాగుంటుంది. అందుకే ముందు మనసులు కలవాలి. ఏమంటావు?" అన్నాడు మహేష్.

కళ్యాణి "మిమ్మల్ని అంతా రెటమతం పెళ్లికొడుకంటూ ఉంటే ఏమో అనుకున్నాను. మీరు రెబల్ పెళ్లికొడుకు" అన్నది నవ్వుతూ.

